Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

Editor : Dama Vijaya Kumar | Volume : 6 | issue: 345 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :345 | మంగళవారం 16 డిసెంబర్ 2025 | వెల : 3 | ఎజీలు : 4

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

## పొట్టిశ్రీరాములు యావత్ తెలుగు

# ప్రజల ఆస్తి



- పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని 'డే ఆఫ్ శాక్రిఫైస్'గా ప్రకటన
- అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అపహాస్యం చేసింది
- పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరు 'వాసవీ పెనుగొండ'గా మార్పు
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన సీఎం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని ఇకపై అధికారికంగా 'డే ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగాల దినం)గా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆయన త్యాగానికి గుర్తుగా రాజధాని అమరావతిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిర్మిస్తామని వెల్లడించారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్యం కోసం, ఆ తర్వాత తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు - మిగతా3లో



## లోక్‌సభలో వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు

- వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును జేపీసీ పంపే అవకాశం
- ఒకే గొడుగు కింద వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే కొత్త కమిషన్‌ను ఏర్పాటు
- 12 మంది సభ్యులతో కూడిన వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే అత్యున్నత కమిషన్ ఏర్పాటు
- ఒకే కమిషన్ ద్వారా విద్యా ప్రమాణాలు కఠినంగా అమలు చేయవచ్చు

## మాట ఇచ్చారు.. పాఠశాలకు కంప్యూటర్లు ఇచ్చారు

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నిధులు ఖర్చు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, చిలకలూరిపేట**

శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాట ప్రకారం లైబ్రరీ, 25 కంప్యూటర్లను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నిధులతో అందజేశారు. డిసెంబర్ 5న చిలకలూరిపేట పట్టణంలోని శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్స్ పేరెంట్స్ మీటింగు ముఖ్య అతిథులుగా విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శారద ఉన్నత పాఠశాలకు విద్యార్థులు అడగడంతోనే లైబ్రరీ 25 కంప్యూటర్లను నా సొంత నిధులతో పంపిస్తానని తెలియజేసి మాట ప్రకారం పది రోజులకే లైబ్రరీ కావలసిన బుక్స్, 25 కంప్యూటర్లు పంపించి కూటమి ప్రభుత్వం యొక్క పనితీరును తెలియజేశారు. శారద జిల్లా - మిగతా3లో



## భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో సర్వీసు ఫీజు పెంపు

- జనవరి 1 నుంచి కొన్ని కేంద్రాల్లో అమల్లోకి పెంపు నిర్ణయం
- నిర్వహణపరమైన వ్యయాలు, ద్రవ్యోల్బణం కారణంగా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- వెల్లడించిన న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్

# చైనా పార్టులు వద్దు..



- రూ.5,000 కోట్లతో స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం
- భారీగా దేశీయ డ్రోన్లను సమకూర్చుకోనున్న సైన్యం
- కామికేజ్, నిఘా, సుదూర లక్ష్య ఛేదన డ్రోన్ల సమీకరణ
- జామింగ్, స్పూఫింగ్‌ను తట్టుకునేలా ప్రత్యేక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యం



## ఢిల్లీలో వాయు కాలుష్యం.. పౌరులకు అడ్వైజరీ జారీ చేసిన సింగపూర్ హైకమిషనర్..!

- జనం తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు
- ఇంట్లోనే ఉండాలని.. బయటకు వచ్చిన సమయంలో మాస్కులు ధరించాలి
- రాజధాని ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ లెవల్-4 అమలు

## భోగాపురంలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ

- రేపు ప్రాజెక్టుకు మంత్రి లోకేశ్ చేతుల మీదుగా శ్రీకారం
- విమానయాన, రక్షణ రంగాల్లో నైపుణ్యాల కొరత తీర్చడమే లక్ష్యం
- 160 ఎకరాల్లో జీఎంఆర్ మాన్సాస్ ఆధ్వర్యంలో నిర్మాణం
- అంతర్జాతీయ వర్సిటీలతో విద్యా, ఆవిష్కరణల హబ్‌గా రూపకల్పన




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలి ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ ఎడ్యుకేషన్ సిటీని విజయనగరం జిల్లా భోగాపురంలో ఏర్పాటు చేయనుంది. 'జీఎంఆర్ మాన్సాస్ ఎడ్యుసిటీ' పేరుతో రానున్న ఈ ప్రాజెక్టును రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రేపు విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. దేశంలో విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలు శరవేగంగా - మిగతా3లో

## ఐసిస్‌తో సంబంధాలు.. ఉగ్రవాదుల అరెస్ట్

- ఐసిస్ ఉగ్రసంస్థ ఆదేశాల మేరకు భారత్‌లో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం
- దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీగా సోదాలు
- గత నెలలో ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) అప్రమత్తం



# సహకారం అందించండి



- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- ఢిల్లీలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ
- రాష్ట్రంలో చేపడుతున్న విద్యా సంస్కరణలను కేంద్ర మంత్రికి వివరణ
- 11 నవోదయ విద్యాలయాలు, రూ.4,400 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- 155 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు అనుమతి కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- ఏపీ ప్రభుత్వ చర్యలను అభినందించిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం నాడు దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు పాల్గొన్నారు. రాష్ట్రంలో - మిగతా3లో

# “మీ కోసం కాదు.. మీ కుటుంబం కోసం హెల్మెట్”

**“నిర్లక్ష్యం ఒక్క క్షణం.. కన్నీళ్లు జీవితాంతం”**
**“హెల్మెట్ మీ ప్రాణాల రక్షణ.. మీ కుటుంబానికి భరోసా”**
**“ఒక హెల్మెట్ ఎన్నో జీవితాలకు రక్షణ”**
**“హెల్మెట్ ధరిస్తేనే ఇంటికి సురక్షితం”**
**రేణిగుంటలో “నో హెల్మెట్ - నో పెట్రోల్”, “నో హెల్మెట్ - నో రైడ్” ర్యాలీ**








**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15 :**
తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పీ ఆధ్వర్యంలో రేణిగుంట సీఐ జయచంద్ర వారి సిబ్బంది,గాజులమండ్యం సీఐ మంజునాథ రెడ్డి వారి సిబ్బంది, జర్నలిస్టులతో కలిసి సోమవారం రోడ్ సేఫ్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. “నో హెల్మెట్ – నో పెట్రోల్”, “నో హెల్మెట్ – నో రైడ్” అనే నినాదాలతో అంబేద్కర్ విగ్రహం కూడలి నుంచి చెక్ పోస్ట్ పెట్రోల్ బంకు వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ... వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ వినియోగం ఎంతో కీలకమని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యం ప్రాణాలకే ప్రమాదంగా మారుతుందని, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే కుటుంబాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అందుకే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

## ఎంజీఎం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.




**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
హిందూపురం ఎంజీఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో ఉత్సాహం జరిగింది. 2000 – 2005 కాలము మధ్యలో చదివిన విద్యార్థులు దాదాపు 60 మంది ఈ సమ్మేళనంలో సంతోషంగా పాల్గొన్నారు. వారందరూ వారి చదివిన పాఠశాల లోని తరగతి గదులలోకలియ తిరిగి పాత జ్ఞాపకాలనునెమరువేసుకొన్నారు. అలాగే ఈ కాలంలో మధ్యలో పాఠాలు చెప్పిన గురువులందరికి ఆహ్వానించడం జరిగింది. గురువులందరికీ పూలమాలతో సత్కరించడం జరిగింది. రెండు దశాబ్దాల క్రితం ఒకే బడిలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ‘పాత స్నేహం.. కొత్త ఉత్సాహం’ పంచుకుంటూ మరోసారి ఆత్మీయంగా కలుసుకున్నారు. హిందూపురం పట్టణంలోని ఎంజిఎం ఉన్నత పాఠశాలలో 2000– 2005 యేడాది మధ్య విద్యను అభ్యసించిన పూర్వ విద్యా ర్థులంతా ఆత్మీయంగా కలుసుకొన్నందుకు ఎంతో ఉత్సాహం వుందని తెలిపారు.బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ఈ కలయిక కేవలం వ్యక్తిగత యోగక్షేమాలకే పరిమితం కాకుండా, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు పట్ల తమ బాధ్యతను చాటుకున్నారు .ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తీసుకున్న నిర్ణయం అందరినీ ఆకట్టుకుంది. తాము చదువుకున్న ఎంజిఎం పాఠశాలకు సీసీ కెమె రాల సామాగ్రిని అందజేశారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహి తులందరూ ఒకరి నొకరు యోగక్షేమాలను తెలుసుకుని చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. రంగనాయకులు, చిన్నప్ప, శాస్త్రి, కమ్మన్న, వెంకటశివుడు, అశ్వతప్ప, రోహిణి, లోకేష్, అమరనారాయణరెడ్డి, తదితర ఉపాధ్యాయులతో పాటు పూర్వపు రిటైర్డ్ గురువు లందరు, పూర్వ విద్యార్థులు హాజరైనట్లు ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి ఎండీ షరీఫ్ పేర్కొన్నారు.

## కృష్ణాపురంలో ప్రభుత్వ భూమి ఆక్రమణల తొలగింపు

**రాళ్ల కాల్వ-మల్లెమడుగు ప్రాంతంలో ఆక్రమిత భూమి స్వాధీనం**



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్15:**
కృష్ణపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం. 98లో, కారకంబాడి రోడ్డుపక్కన టూరిజం స్థలం సమీపంలో ఉన్న రాళ్ళకాల్వ–మల్లెమడుగు ప్రాంతంలో జరిగిన ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు గుర్తించి తొలగించారు.ఆక్రమిత ప్రభుత్వ భూమిని పూర్తిగా ఖాళీ చేయించి,నిబంధనల ప్రకారం ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్రమణలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## అమరజీవులు పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి అర్పించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సోమవారం కలెక్టరేట్ వివేకనంద కార్యాలయం ఆవరణలో 73వ వర్ధంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి ఆత్మార్పణ దినం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు తెలుగుజాతికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ప్రాణత్యాగంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, యావత్ తెలుగుజాతికి పొట్టిశ్రీరాములు నిత్యస్మరణీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి చేరుకున్న రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు



**సాదర స్వాగతం పలికిన కూటమి ఎంపీల బృందం**

**చిత్తూరు, (ఢిల్లీ) చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
ఢిల్లీకి చేరుకున్న రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకి ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపీల బృందం సాదర స్వాగతం పలికింది.. వీరిలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కూడా ఉన్నారు. కేంద్ర మంత్రులు, కూటమి ఎంపీల బృందం కలిసి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఘన స్వాగతం పలికారు.

## ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
ఆంధ్ర రాష్ట్రం కోసం తన ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తి, ధైర్యసింహం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి విశేషాలు కుప్పం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆమరణ నిరాహార దీక్ష ద్వారా ఆంధ్ర జాతి స్వప్నాన్ని నిజం చేసి, మనకు ఒక గుర్తించగల రాష్ట్రాన్ని అందించిన మహానుభావుడు. మాటల్లో కాదు, ప్రాణాలతో చూపిన దేశభక్తి, ఆయన త్యాగం, ఆదర్శాలు తరతరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని భాగస్వాములు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రపితామహుడిగా, హిందూ సంస్కరణల అమలు, హరిజనోద్ధరణకు పాటు పడి, గాంధీజీ ఆశయాల కోసం బ్రిటిష్ వారిపై పోరాడిన అమరవీరుడికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజు, వణికుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ కేఎం వేణుగోపాల్, మున్సిపాలిటీ కౌన్సిలర్ సోమశేఖర్, కే.ఎస్, గిరిధర్ బాబు, ఎస్.ఎన్. దినకర్, టీడీపీ మున్సిపాలిటీ వాణిజ్య విభాగం అధ్యక్షులు రాజేష్, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శి కృష్ణ, ప్రవీణ్, ఎల్ఐసి రాజు, ఆర్యవైశ్య సంఘం, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్ నో పెట్రోల్




**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
శ్రీకాళహస్తి నో హెల్మెట్ నో పెట్రోల్ అనే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. నేటి నుంచి నో హెల్మెట్ నో పెట్రోల్ కార్యక్రమం అమల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ముత్తరాశి పాలెం హెచ్. పి.పెట్రోల్ బంకు దగ్గర సీఐ నాగార్జున రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ ఉన్న వాహనదారులకు మాత్రమే పెట్రోలు పొస్తారని, అదేవిధంగా హెల్మెట్ లేని వాహనదారులు పెట్రోల్ కోసం వస్తే వాళ్లతో సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ఒక బరువు కాదని, కుటుంబం మనపై పెట్టుకున్న బాధ్యత అని అన్నారు. మన ప్రాణాలు, తల్లిదండ్రుల ఆశలు, భార్యా పిల్లల భవిష్యత్తు అన్నీ మన చేతుల్లోనే ఉన్నాయని గుర్తుచేశారు. ప్రమాదం జరిగిన తర్వాత అప్పుడు హెల్మెట్ పెట్టుంటే బాగుండేది అని అనుకునే పరిస్థితి ఎవరికీ రాకూడదన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి పెట్రోల్ పోసుకోవాలని సీఐ సూచించారు. నో హెల్మెట్ నో పెట్రోల్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూభాగస్వాములు కావాలని కోరారు. మరోసారి హెల్మెట్ లేకుండా పెట్రోల్ కోసం వస్తే కేసులు నమోదు చేస్తామని వాహనదారులను సూచించారు.

## రైళ్లలో చోరీలు చేస్తున్న నిందితుడి అరెస్ట్

**రూ.9.10 లక్షల నగదు స్వాధీనం**

**చెన్నై డి ఎస్ ఆర్ పి సహకారంతో రేణిగుంట పోలీసుల ఆపరేషన్**



**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15 :**
రైళ్లలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రేణిగుంట రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.9.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గత కొంత కాలంగా రైళ్లలో వరుసగా చోరీలు జరుగుతున్న నేపథ్యం లో రేణిగుంట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో డి.ఎస్.ఆర్.పి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ లో నిందితుడిని పట్టుకున్నారు. అరెస్ట్ అయిన నిందితుడు నీల లోకేష్ కుమార్ (36). ఇతను తమిళనాడు రాష్ట్రానికి చెందినవాడిగా పోలీసులు గుర్తించారు.విచారణలో రైళ్లలో ప్రయాణికుల బ్యాగులు, విలువైన వస్తువులు చోరీ చేసి నగదుగా మార్చుకునే విధానాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడైంది.నిందితుడిపై రేణిగుంట రైల్వే పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 102/2024,క్రైమ్ నెంబర్ 105/2025, క్రైమ్ నెంబర్53 /2025 కేసులు నమోదు కాగా,బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసును ఛేదించిన బృందంలో ఐ ఆర్ పి రేణిగుంట పి.యతీంద్ర, ఆర్పి ఎస్పై బి. మధుసూదన్ రావు, దుర్గా ప్రసాద్‌తో పాటు సిబ్బంది కీలక పాత్ర పోషించారు.చెన్నై ఆర్పిఎఫ్ క్రైమ్ బ్రాంచ్ మరియు డి ఎస్ ఆర్ పి ఎస్.ఆర్. హర్షిత్ సహకారం అందించారు. పోలీసుల అప్ర మత్తతతో మరోసారి రైలు ప్రయాణికుల కు భద్రత కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## బస్టాండ్ ఆటో స్టాండ్ అభివృద్ధి చేయాలి

**పంచాయతీ కార్యదర్శికి ఆటో యూనియన్ల వినతి**



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
రేణిగుంట బస్టాండ్ ప్రాంతంలోని ఆటోస్టాండ్‌ను అభివృద్ధి చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సోమవారం పలు ఆటో యూనియన్లు రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. శ్రీ కట్ట పుట్టాలమ్మ,వెదెల చెరువు, పాపాయి నాయుడుపేట ఆటో యూనియన్‌లకు చెందిన నాయకులు, వర్కర్లు సంయుక్తంగా ఈ వినతిని సమర్పించారు. రేణిగుంట బస్టాండ్ ప్రాంతంలోని ఆటో స్టాండ్‌లో సుమారు 100 ఆటోలు ఉన్నాయని, అయితే ఆ ప్రాంతం పూర్తిగా అపరిశుభ్రంగా మారడంతో ఆటోలు నిలుపుకునే పరిస్థితి కూడా లేదని వారు వాపోయారు.పక్కనే ఉన్న మురుగునీటి కాలువలకు ప్రహరీ నిర్మించి,పరిశుభ్ర వాతావరణంలో ఆటోలు నడుపుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. ఈ విషయంపై స్పందించిన కార్యదర్శి రమేష్, ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి ఆటో యూనియన్ నాయకులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీకట్టపుట్టాలమ్మ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఐనూరు రవికుమార్, వెదెల చెరువు ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వెంకటరమణ, పాపానాయుడుపేట ఆటో యూనియన్ ప్రెసిడెంట్ లాల్ భాషతో పాటు యూనియన్ నాయకులు ప్రకాష్,మురళి, గురవయ్య,మనీ,రమేష్,సుబ్బయ్య,శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు**

## డా.ఎన్.సునిల్ రాజ్‌కు అవార్డు ప్రధానం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు డా. ఎన్. సునిల్‌రాజ్‌కు సాంకేతిక విద్యకు చేసిన విశిష్ట సేవలకుగాను ఈ సమావేశంలో అవార్డు లభించింది. న్యూఢిల్లీలో డిసెంబర్ 14న నిర్వహించిన గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్ అండ్ అవార్డ్స్–2025 కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఈ అవార్డును పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ క్రికెటర్ వీరేందర్ సెహ్వాగ్ డా. సునిల్ రాజ్‌కు అందజేశారు. సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాల పెంపు, విద్యార్థి కేంద్రిత బోధన, సంస్థాగత అభివృద్ధిలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. డా. సునిల్ రాజ్ నాయకత్వంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అక్రెడిటేషన్ స్థాయిలు మెరుగుపడగా, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయి.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ పానగల్ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి అగర్వాల్ మెడికల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బ్రాంచ్ మేనేజర్ బి నరేష్ ప్రారంభించారు. బ్రాంచ్ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ... ఈ అవకాశాన్ని మన ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు యాజమాన్యానికి, అగర్వాల్ కంటి వైద్య హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 110 మంది ఖాతాదారులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన చికిత్సపై సూచనలు ఇచ్చారు. పలు కంటి సమస్యలను గుర్తించి ఖాతాదారులకు తగిన జాగ్రత్తలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బి.నరేష్ , సిబ్బంది ఎం.సోము, మల్లికార్జున్, చిట్టిబాబు, ప్రసాద్ కలిసి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## వి.కోటలో సంఘం శరణం గచ్ఛామి..

**నృత్య రూపక నాటకం..**

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:**
వీ.కోట దుర్గా నగర్ శ్రీదుర్గా మాత కళ్యాణ మండపం నందు డిసెంబర్ 16 మంగళవారం సాయంత్రం 6 గంటలకు సంఘం శరణం గచ్చామి, అనే నృత్య నాటకమును హైదరాబాద్ కళాకారుల చేత నిర్వహించబడునని వీకోట డీజే ఏసీ సభ్యులు తెలియజేసినారు. ఈనాటకలో అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి ప్రదర్శించబడనని కావున విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలియజేసినారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# జగన్‌కు దూరమవుతున్న ఫ్యామిలీలు



**విజయవాడ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి మంచి పట్టున్న పొలిటికల్ ఫ్యామిలీలు జగన్ వెంట నడిచాయి. ముఖ్యంగా రాజశేఖర్ రెడ్డి తో ఉన్న అనుబంధం, ఆపై సామాజిక వర్గ ప్రభావంతో చాలామంది నేతలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారు. ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కేతిరెడ్డి ఫ్యామిలీ.. వంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబాలు జగన్ వెంట నడిచాయి. అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఫ్యామిలీలకు ప్రాధాన్యత తగ్గింది. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లాంటి నేతలకు మాత్రమే జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యమిచ్చారు. ఆర్థికంగా కూడా చేయూతను అందించారు. అందుకే ఆది నుంచి జగన్ వెంట నడుస్తున్న ఫ్యామిలీలు దూరమైనట్టు కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పొలిటికల్ ఫ్యామిలీల అండ ఎక్కువ. శ్రీకాకుళం(నుంచి అనంతపురం వరకు కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన కుటుంబాలన్నీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాయి. అయితే రాజశేఖర్ రెడ్డి మాదిరిగా జగన్ వద్ద వారికి అనుకున్నంత ప్రాధాన్యం లేదు. ఆ బాధతోనే చాలామంది ప్రత్యామ్నాయం లేక పార్టీలోనే కొనసాగుతూ సైలెంట్ గా ఉన్నారు. జగన్మోహన్ రెడ్డికి చెబితే వినరు.. తమ విషయంలో అస్సలు ప్రాధాన్యం ఇవ్వరు అన్న బాధ వారిలో ఉంది. ఆ కారణంతోనే సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు చాలా రోజులు పార్టీకి దూరంగా ఉండిపోయారు. ఫలితాలు వచ్చిన తర్వాత పూర్తిగా సైలెంట్ అయిన ఆయన ఇటీవల మళ్ళీ యాక్టివ్ అయ్యారు. జగన్మోహన్ రెడ్డి తీసుకునే నిర్ణయాలు, ఆయన వ్యవహార శైలి చాలామంది సీనియర్లకు రుచించడం లేదు. తాము జగన్మోహన్ రెడ్డి కోసం త్యాగం చేస్తే.. తమ త్యాగాలను అస్సలు పట్టించుకోవడం లేదన్న బాధ చాలామంది సీనియర్లలో ఉంది.నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి రాజమోహన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి సమకాలీకుడు. అందుకే జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని భావించారు. తన ఫ్యామిలీతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజమోహన్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి, కుమారులు గౌతంరెడ్డి, విక్రమ్ రెడ్డి అంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం గట్టిగానే పని చేశారు. అయితే గౌతమ్ రెడ్డి మరణం తర్వాత ఆ కుటుంబానికి క్రమేపి ప్రాధాన్యం తగ్గింది. రాజమోహన్ రెడ్డి సూచనలను జగన్మోహన్ రెడ్డి పట్టించుకోవడం మానేశారు. దీంతో ఆయన తీవ్ర మనస్థాపంతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీలో ఉండడం వేస్ట్ అన్నట్టు ఒక నిర్ణయానికి వచ్చినట్లు టాక్ నడుస్తోంది. తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయత కలిగిన కుటుంబం ఆళ్ళ కుటుంబం. స్వతహాగా పారిశ్రామికవేత్త అయిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డిజగన్ వెంటే అడుగులు వేశారు. ఆయన సోదరుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డి సైతం జగన్మోహన్ రెడ్డి కోసం, ఆయన నాయకత్వం బలపరిచేందుకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఆరాటపడ్డారు. ఎంతగానో కృషి చేశారు. అయితే వారి కృషికి తగ్గ గుర్తింపు ఇవ్వలేదు జగన్మోహన్ రెడ్డి. చివరకు మంగళగిరిలో ఆళ్ల రామకృష్ణారెడ్డికి టికెట్ కూడా ఇవ్వలేదు. దీంతో ప్రస్తుతం ఆ ఫ్యామిలీ అసంతృప్తితో ఉంది. ఆళ్ల అయోధ్య రామిరెడ్డి రాజ్యసభ పదవీకాలం జూన్ తో ముగియనుంది. ఆ కుటుంబం సైతం పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

# 6 వందలకోట్లతో బెజవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి



**విజయవాడ :** అమరావతి రాజధానికి దీటుగా విజయవాడ రైల్వే స్టేషన్ ను పిపిపి మోడ్ లో అభివృద్ధి చేయడానికి రైల్వే శాఖ సంసిద్ధమైంది. ఇప్పటికే ప్రతిపాదనలపై ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ 661.11 కోట్ల రూపాయల నిధులు కూడా మంజూరు చేయడంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది.మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ వంటి తరహాలో అమరావతి రాజధానికి అతి సమీపంలోని విజయవాడ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రతిపాదనలు రూపొందించారు. రైల్వే స్టేషన్ అభివృద్ధికి కావాల్సిన బ్లూ ప్రింట్ ను కూడా తయారు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో 83.367 చదరపు మీటర్లుగా నిర్ణయించుకోగా వ్యాపార లావాదేవీలకు, స్టాల్స్, హోటల్ లాంటివి దగ్గర నుంచి రైల్వే కోటర్స్, స్టేషన్ కార్యాలయం వరకు 81.948 చదరపు మీటర్లలో అభివృద్ధి చేయనున్నారు. బెజవాడ రైల్వే స్టేషన్ ను విజయవాడ నగరానికి ఆకర్షణీయంగా నిలిచే విధంగా తూర్పు, పడమర వైపు ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు.తూర్పు ముఖద్వారం వైపు పార్లమెంటు ముఖద్వారానికి ధీటుగా సూపర్ లుక్‌తో ఆకట్టుకునే విధంగా నమూనాలను ఇప్పటికే తయారు చేశారు. అలాగే పడమర వైపు వన్ టౌన్ ప్రాంతమంతా కూడా వ్యాపారాలకు ప్రసిద్ధి. ఆ ప్రాంతంలో రైల్వే స్టేషన్ లో సైతం వివిధ వ్యాపారులకు అనుకూలంగా ఉండే విధంగా భవనాలను నిర్మిస్తున్నారు. ఇందులో రెండు మూడు అంతస్తులు వ్యాపారులకు అనుకూలంగా నిర్మించడానికి రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్ లో మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. అయితే పెరిగిన రైళ్లకు తోడు ప్రయాణికుల సంఖ్య అత్యధికంగా పెరిగింది. దీంతో బడ్జెట్ను కూడా కేటాయించారు.ఇదిలా ఉండగా రైల్వే స్టేషన్ కు తూర్పు వైపు బయట ఉన్న సిటీ బస్టాండ్, స్కూటర్ పార్కింగ్ దగ్గర నుంచి టవర్ క్లాక్ ప్రాంతమంతా కూడా ఈ అభివృద్ధిలో మార్పులు చోటుచేసుకుని ఉన్నాయి. ఈ ప్రాంతం దగ్గర్లో స్టేషన్ కు చెందిన 41.70 చదరపు మీటర్ల ప్రాంతంలో జి ప్లస్ టు భవనం నిర్మించనున్నారు. అలాగే పడమర వైపు జి ప్లస్ టు 6.647 చదరపు మీటర్ల పరిధిలో భవనాలను నిర్మించనున్నారు.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో రైల్వే అధికారులు చర్చలు జరిపారు. తూర్పు వైపు నిర్మించనున్న ముఖద్వారం కానీ జి ప్లస్ టు వంటి భవన నిర్మాణాలే కానీ అన్నిటికీ అనుకూలమైన ప్రదేశం ఉండగా పడమర వైపు గాంధీ హిల్ కొండ ప్రాంతంలోని 100 మీటర్ల మేర ఇప్పటికే రైల్వే వెస్ట్ బుకింగ్ కార్యాలయం, టీటీల విశ్రాంతి భవనంతో పాటు ఆర్పీఎఫ్ విశ్రాంతి భవనాలు నిర్మించి ఉన్నాయి. రైల్వే స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే గాంధీ హెల్కొండ ప్రాంతంలో మరికొంత భాగం స్టేషన్ అభివృద్ధికి కేటాయించాలని ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే చర్చలు జరిగినట్టు సమాచారం దీనికి ప్రభుత్వం సానుకూలం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.

# బాహుబలి రాకెట్ ప్రయోగానికి సిద్ధం



**నెల్లూరు :** ఇస్రో.. ఒకప్పుడు సైకిల్‌పై రాకెట్‌ను తీసుకెళ్లి ప్రయోగాలు చేపట్టింది. అంతరిక్ష ప్రయోగాల్లో దిగ్గజాలు అయిన రష్యా, చైనా , అమెరికా లాంటి దేశాలు మనల్ని అవహేళన చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇపుడు అదే రష్యా, అమెరికా దేశాలకు ఇస్రో కీలక ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశ పెట్టే స్థాయికి చేరుకుంది.. ఐదేళ్ల క్రితం వరకు చిన్న చిన్న ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించే సామర్థ్యం ఉన్న ఇస్రో ఇపుడు అత్యంత భారీ ఉపగ్రహాలను సైతం అంతరిక్షంలోకి ప్రవేశపెట్టే లెవల్ ఉన్న రాకెట్‌ను తయారు చేసింది.. మరో నాలుగైదు రోజుల్లో ఈ మెగా బాహుబలి రాకెట్ ప్రయోగం జరగనుంది.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుంచి బ్లూబర్డ్?6 ప్రయోగం జరగనుంది. ఈ ఉపగ్రహాన్ని ఒఎం-03 ఓ6 అనే రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది బ్లూబర్డ్ శాటిలైట్. భారత్?అమెరికా సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని చేపడుతున్నాయి. ఇస్రో రాకెట్ ప్రయోగ తేదీని ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఈ నెల 15 నుంచి 20 లోపు ప్రయోగం జరగనుంది. ఎల్‌వీఎమ్-3, ఓ6 రాకెట్ ప్రయోగానికి చాలా ప్రత్యేకత ఉంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వద్ద రెండు టన్నుల బరువున్న ఉపగ్రహాలను మాత్రమే నింగిలోకి ప్రవేశ పెట్టగలిగేది. అంతకంటే బరువైన ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపాలంటే ఫ్రెంచ్, గయా, రష్యా లాంటి దేశాల సహకారంతో ఉపగ్రహాలను ప్రవేశపెట్టేది ఇస్రో.. ఇప్పుడు ఆ పరిస్థితులను అధిగమించింది.. ఒఎం ? 03 సరికొత్త వాహక నౌకను తయారు చేసింది.. 4 టన్నుల బరువు ఉన్న ఉపగ్రహాలను సైతం నింగిలోకి తీసుకెళ్లే సామర్థ్యం కలిగిన రాకెట్‌ను తయారు చేసి సక్సెస్ చేసింది. ఈ రాకెట్‌ను బాహుబలి రాకెట్‌గా పిలిచేవారు.. ఇప్పుడు అంతకు మించి అన్నట్లు ఇంకా చెప్పాలంటే బాహుబలి 2 రాకెట్ అన్నట్లు ఒఎం- 03 అప్‌గ్రేడ్ అయింది.. 6.5 టన్నుల బరువున్న అమెరికాకు చెందిన బ్లూ బర్డ్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశ పెట్టనుంది.. ప్రయోగ సమయాన్ని ఇస్రో అధికారికంగా ప్రకటించనుంది.టెక్సాస్ కేంద్రంగా పనిచేసే ం స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించిన బ్లూబర్డ్ శ్రేణి ఉపగ్రహం ప్రపంచవ్యాప్తంగా నేరుగా మొబైల్ బ్రాడ్ బ్యాండ్ సేవలను మెరుగ్గా అందించేందుకు ఈ బ్లూ బర్డ్ శాటిలైట్‌ను రూపొందించారు. ఈ ఉపగ్రహం హై బ్యాండ్‌విడ్త్ నెట్వర్క్ అందించే సామర్థ్యం కలిగి ఉంటుంది. భూమిపై పనిచేస్తున్న మొబైల్ నెట్‌వర్క్ సేవలకు లైసెన్స్ స్పెక్ట్రమ్ ద్వారా అనుసంధానం చేసి.. సేవలను విస్తరించేలా ఈ వ్యవస్థ పని చేస్తుంది. అక్టోబరు 19న అమెరికా నుంచి బ్లూబర్డ్-6 ఉపగ్రహం శ్రీహరికోటకు చేరి అనుసంధాన పనులు, ఇంధన నింపుదల, తుది తనిఖీల పరిశీలనలు శాస్త్రవేత్తలు విజయవంతంగా పూర్తి చేశారు. ఇతర ఉపగ్రహాల కంటే మూడున్నర రెట్లు పెద్దదిగా, సుమారు పది రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేయనుంది. ఇదే రాకెట్ ద్వారా భారత్ చేపట్టనున్న గగన్యాన్ ప్రాజెక్టు ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది ఇస్రో.

## పొట్టిశ్రీరాములు యావత్ తెలుగు ప్రజల ఆస్తి

-మొదటిపేజీ తరువాయి

పొట్టిశ్రీరాములు. పాలకుల వివక్షకు గురైన తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారు. ఆయన కృషితోనే 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం, 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. కొందరు ఈ తేదీలపై అనవసర రాజకీయం చేస్తున్నందునే, ఆయన ఆత్మార్పణ చేసిన రోజునే త్యాగాలకు గుర్తుగా నిర్వహించాలని నిర్ణయించాం" అని స్పష్టం చేశారు. పొట్టిశ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ తెలుగు ప్రజల ఆస్తి, గుండె చప్పుడు అని కొనియాడారు. పొట్టిశ్రీరాములు స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో స్మృతి వనంతో పాటు, చెన్నైలో ఆయన తుదిశ్వాస విడిచిన భవనాన్ని, నెల్లూరులోని నివాసాన్ని మెమోరియల్స్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ గతంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరు పెట్టారని, తాను కూడా నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు పేరు పెట్టానని గుర్తుచేశారు.

**మహా కుట్ర చేశారు**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర పన్నారు. అసలు రాజధానే లేకుండా చేసి ప్రపంచం ముందు రాష్ట్రాన్ని అపహాస్యం చేశారు. కనీసం రాజధాని పేరు చెప్పుకోలేని దుస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటున్నాం" అని అన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ విధానం వల్లే రహదారులు, విమానాశ్రయాలు అభివృద్ధి చెందాయని, ఇది పార్లమెంటరీ కమిటీ కూడా సమర్థించిన ఉత్తమ విధానమని అన్నారు. కాలేజీలు ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పేరును 'వాసవీ పెనుగొండ'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, మహిళలు ప్లకార్డులు ప్రదర్శించి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ, తెలుగు జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## సహకారం అందించండి

-మొదటిపేజీ తరువాయి

విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న పలు కీలక నిర్ణయాలను లోకేశ్ ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వివరించారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో పఠన, గణన నైపుణ్యాలు పెంచేందుకు 'గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్' కార్యక్రమం, అభ్యసన సామర్థ్యాల కోసం క్లిక్కర్ ఆధారిత ఇంటరాక్టివ్ క్లాస్‌రూమ్‌లు ప్రవేశపెట్టామని తెలిపారు. విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' పేరుతో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నామని, బాలల భారత రాజ్యాంగాన్ని పుస్తక రూపంలో తీసుకొచ్చామని వివరించారు. దేశంలోనే తొలిసారిగా కడపలో ఏర్పాటు చేసిన సెంట్రల్ స్మార్ట్ కిచెన్ గురించి కూడా ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు. అనంతరం, రాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన సహకారంపై మంత్రి లోకేశ్ పలు విజ్ఞప్తులు చేశారు. రాష్ట్రానికి ప్రతిపాదించిన 11 జవహర్ నవోదయ విద్యాలయాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే, ఇప్పటికే కేటాయించిన 12 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. సమగ్ర శిక్ష సంస్కరణల్లో భాగంగా స్టార్స్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రానికి రూ.4,400 కోట్ల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.1,270 కోట్ల అదనపు నిధులకు ఆమోదం తెలపాలని, పీఎం పోషణ్ పథకం కింద పైలట్ ప్రాజెక్టుగా 155 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఈ సందర్భంగా, గుంటూరు జిల్లా చినకాకానిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేసిన మోడల్ ఆటిజం సపోర్ట్ సెంటర్‌ను ప్రారంభించాలని లోకేశ్.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆహ్వానించారు.

## మాట ఇచ్చారు.. పాఠశాలకు కంప్యూటర్లు ఇచ్చారు

-మొదటిపేజీ తరువాయి



పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీమంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, పంచాయ తీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, ఆర్డీవో మధులత, మండల విద్యా శాఖ అధికారులు తాహశీల్దార్, పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాఠశాల విద్యా కమిటీ అందరూ పాల్గొని ఉన్నత పాఠశాలలో లైబ్రరీ కంప్యూటర్ ల్యాబ్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మా కోసం ఇంత చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారికి ధన్యవాదాలు అని తెలియజేశారు.

## భోగాపురంలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ..




-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి చెందుతున్నాయి. ఈ రంగాల మార్కెట్ విలువ 2034 నాటికి 57 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అయితే, ఈ వేగానికి తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో లేవు. దేశం ప్రస్తుతం పైలట్లు (12-15%), ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు, భద్రతా నిపుణుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఏటా కేవలం 8 వేల మంది ఏరోస్పేస్ ఇంజనీర్లు మాత్రమే పట్టభద్రులవుతున్నారు. ఇది మొత్తం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో 0.5 శాతమే కావడం గమనార్హం. ఈ నైపుణ్యాల కొరతను అధిగమించే లక్ష్యంతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 160 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎడ్యుసిటీని నిర్మించనున్నారు. ఇది ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు అంకితమైన దేశంలోని మొట్టమొదటి సమీకృత విద్యా, ఆవిష్కరణల కేంద్రంగా (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేషన్ హబ్) నిలవనుంది. ఇందులో ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీల బ్రాంచ్ క్యాంపస్‌లు, పరిశోధన కేంద్రాలు, స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. మేకిన్ ఇండియా, జాతీయ విద్యా విధానం వంటి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు యావత్ భారతదేశాన్ని ఏవియేషన్, ఏరోస్పేస్ విద్య, ఆవిష్కరణలలో ప్రపంచస్థాయి లీడర్ గా నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

## సిఎస్ ఆర్ నిధులతో విద్యార్థులకు భరోసా

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:** సిఎస్ఆర్ నిధులు జిల్లాలోని రెండు పారిశ్రామిక యాజమాన్యాలు ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించారు. అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమానంతరం జిల్లాలో గుడిపాల మండలంలోని శ్రీవెంకటేశ్వర గ్రానైట్ పరిశ్రమల యజమాని ఆధ్వర్యంలో ఎన్ నాగజ్యోతి సుమారు 61,500 రూపాయలు విలువ చేసే కంప్యూటర్ పరికరాలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం యాదమరి మండలం నరవరం అరుంధతి వాడకు చెందిన టీ తేజశ్రీ, వారణాసి నందు IIT చదువుతున్నది, నిరుపేదలైన వారికి కలెక్టర్ చొరవతో సోమవారం రోజు కుప్పం రత్నం గ్రానైట్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆ విద్యార్థినికి సుమారు 80 వేల రూపాయలు విలువ చేసే HP Laptop 14-ep1152TU జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థినికి పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా మైనింగ్ శాఖ డిడి, సిపిఓ పాల్గొన్నారు.

## అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి.

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:** అర్జీలనుసకాలంలో పరిష్కరించాలి జిల్లా కలెక టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని PGRS సమావేశం మందిరం లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డిఆర్ఓ మోహన్ కుమార్ తో పాటు ప్రజల నుంచి అర్జీ స్వీకరించే కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు,డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలకు సంబంధించిన ఆడిట్ ను జిల్లా అధికారులు ప్రాధాన్యతగా పూర్తి చేయాలని, ఇందులో నాణ్యత బాగుండాలన్నారు. మొత్తం : 293 అర్జీలు ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు :రెవెన్యూ, సర్వే డిపార్ట్మెంట్ 204, పంచాయతీరాజ్ శాఖ 4 , పోలీస్ శాఖ 14, ద్వామ పిడి 3, విద్యాశాఖ 4, డి.పి.ఓ 4, వైద్య ఆరోగ్యశాఖ 2, హార్టికల్చర్ 1, డిఆర్డిఏ పిడి 28, సివిల్ సప్లై 4, విద్యుత్ శాఖ 2, సర్వ శిక్షణ అభియాన్ 2, హౌసింగ్ 6, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, వాటర్ రిసోర్సెస్ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 2, సిపిఓ 2, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 2, రోడ్లు మరియు భవనాల శాఖ 2, ఎస్ సి కార్పొరేషన్ 3, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక టర్, ఆర్డిఓ, డిఆర్ఓ, డిప్యూటీ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామస్థాయి నుండి పార్టీని

## బలోపేతం చేయడమే మా లక్ష్యం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:** అన్నమయ్య జిల్లా పీలేరు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశానుసారం సదుం, రొంపిచర్ల, పులిచెర్ల మండల గ్రామా లలో ఎన్నికలబూత్ పరిశీలకులుగా పార్టీ ని బలోపేతం చేసేలా పార్టీపై పూర్తి నమ్మకం కలిగేలా చేయడమే, మా లక్ష్యం అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి,డైరెక్టర్ కిషోర్ నాయుడు, తెలిపారు పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీ గుర్తింపునిస్తుందన్నారు.

### పీలేరు మండల వి.ఆర్.ఓ

## అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:** అన్నమయ్య జిల్లా పీలేరు తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం పీలేరు మండల వి.ఆర్.ఓ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు ఈ ఎన్నికల్లో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా గూడరేవుపల్లి గ్రామ వి.ఆర్.ఓ బుక్కే హేమంత్ నాయక్ ఉపాధ్యక్షులుగా దొడ్డిపల్లి వి.ఆర్.ఓ బత్తల ఎల్లప్ప కార్యదర్శిగా బోడుమల్లువారిపల్లి వి.ఆర్.ఓ ఆర్.సిద్ధయ్య కోశాధికారులుగా రేగల్లు వి.ఆర్.ఓ పీ.కవిత, బండ్లవంక వి.ఆర్.ఓ వి.కళ్యాణిలను ఎన్నుకోవడం జరిగింది.

### విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా

## స్కౌట్ మాస్టర్లు కృషి చేయాలి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 15:** శ్రీకాళహస్తి చిన్నతనం నుండి విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా స్కౌట్ మాస్టర్లు కృషి చేయాలని ఎం.ఇ.ఓ బాలయ్య కోరారు. శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ మాస్టర్ బేసిక్ క్యాంపును ఎం.ఇ.ఓ బాలయ్య ప్రారంభించారు. ఈ క్యాంపుకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుండి 30 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముందుగా బాలయ్య క్యాంపు లీడర్ జి. వెంకటేశ్వర్లు స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య తిరుపతి జిల్లా ఇన్చార్జ్ సెక్రెటరీ విజయకుమార్ స్వాగతం పలికారు. అనంతరం స్కౌట్ ఉద్యమ విశేషాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎం.ఇ.ఓ బాలయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రతి ఒక్కరిని పేరుపేరునా అభినందించడం జరిగినది . ఈ కార్యక్రమంలో స్కౌట్స్ తిరుపతి జిల్లా సెక్రెటరీ జి.విజయ్ కుమార్, జి వెంకటేశ్వర్లు, షేక్ అజారుద్దీన్, సత్యనారాయణ, మహేంద్ర,స్కౌట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ‘నంబర్ 3’లో ఇప్పటికే ఏడుగురు..

## సూర్య, తిలక్.. ఎవరు బెస్ట్?




టీ20 ప్రపంచకప్-2024 టైటిల్ గెలిచిన తర్వాత టీమిండియాలో చోటు చేసుకున్న ప్రధాన మార్పు.. దిగ్గజాలు రోహిత్ శర్మ- విరాట్ కోహ్లిలేని జట్టు. ఈ మెగా టోర్నీలో భారత్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత వీరిద్దరు అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

**హార్దిక్ పాండ్యాకు బదులు**

ఇక అప్పటి నుంచి జట్టు పునర్నిర్మాణంలో భాగంగా భిన్న పరిణామాలు చోటుచేసుకున్నాయి. హార్దిక్ పాండ్యాకు బదులు సూర్యకుమార్ యాదవ్‌కు బీసీసీఐ పగ్గాలు అప్పగించింది. అతడు సారథిగా విజయాలు సాధిస్తున్నా.. బ్యాటర్‌గా మాత్రం అప్పటి నుంచి విఫలమవుతూనే ఉన్నాడు. మరోవైపు.. బ్యాటింగ్ ఆర్డర్‌లో కీలకమైన మూడో స్థానంలో ఎవరిని ఆడించాలన్న విషయం ఇప్పటికీ స్పష్టత రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. టీ20 ఫార్మాట్లో మరో వరల్డ్‌కప్ టోర్నీకి సమయం ఆసన్నమవుతున్న వేళ.. టీమిండియాలో ఇంత వరకు ఈ కన్ఫ్యూజన్‌కు మాత్రం తెరపడటం లేదు.

**మూడో స్థానంలో**

ఒకప్పుడు మూడో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు వచ్చేవాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుని తిరిగి వచ్చిన తర్వాత కూడా సత్తా చాటి ప్రపంచకప్‌లో పాల్గొన్నాడు పంత్. అయితే, ఆ తర్వాత పంత్‌తో పాటు చాలా మంది సీనియర్లకు టెస్టుల్లో ప్రాధాన్యం ఇస్తూ టీ20 జట్టును యువ ఆటగాళ్లతో నింపేసింది యాజమాన్యం. అభిషేక్ శర్మకు తోడుగా.. సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపగా.. వీరు సక్సెస్‌ఫుల్ జోడీగా నిరూపించుకున్నారు. ఇక మూడో స్థానంలో యువ ఆటగాడు తిలక్ వర్మ.. కెప్టెన్ సూర్యతో పోటీపడ్డాడు. వన్‌డౌన్‌లో తాను సరైన వాడినేనని నిరూపించుకున్నాడు కూడా!

**పక్కనపెట్టేశారు**

అయితే, గత కొంతకాలంగా హెడ్‌కోచ్ గౌతం గంభీర్ బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రయోగాలతో విమర్శల పాలవుతున్న విషయం తెలిసిందే. గిల్ కోసం ఓపెనర్‌గా సంజూను తప్పించి.. మిడిలార్డర్‌లో ఓసారి, వన్‌డౌన్‌లో ఓసారి ఆడించారు. ఇప్పుడిక ఏకంగా వికెట్ కీపర్ కోటాలోనూ ఆడించకుండా పక్కనపెట్టేశారు. మరోవైపు.. కీపర్‌గా, ఫినిషర్‌గా జితేశ్ శర్మ రాణిస్తుండటంతో సంజూ ప్రపంచకప్ ఆశలు దాదాపు ఆవిరిఅయ్యినట్టే!

**ముచ్చటైన ‘మూడు’ కోసం ఇప్పటికే ఏడుగురు**

ఇక మూడో స్థానం విషయానికొస్తే.. 2024 వరల్డ్‌కప్ తర్వాత ఇప్పటి వరకు సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, శివం దూబే, అక్షర్ పటేల్.. ఇలా చాలా మంది ఆడారు. వీరిలో సూర్య 26.92 సగటుతో 157కు పైగా స్ట్రైక్‌రేటుతో 377 పరుగులు సాధించగా.. తిలక్ వర్మ 185కు పైగా స్ట్రైక్‌రేటుతో.. 161కి పైగా సగటుతో ఏకంగా 323 పరుగులు సాధించాడు. మిగిలిన వారిలో రుతురాజ్, సంజూ, అభిషేక్, శివం, అక్షర్.. ప్రయోగాత్మకంగా వచ్చి వరుసగా 84, 58, 24, 24, 21 పరుగులు చేశారు. అయితే, ఇటీవల సౌతాఫ్రికాతో సిరీస్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తమ జట్టులో కేవలం ఓపెనింగ్ జోడీ మాత్రమే స్థిరంగా ఉంటుందని స్పష్టం చేశాడు. మిగతా ఆటగాళ్లు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏ స్థానంలో రావడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని.. ఉంటారనీ పేర్కొన్నాడు.

**వారధి**

నిజానికి టీ20 క్రికెట్‌లో నంబర్ 3 అనేది ఫిల్లర్ పొజిషన్ కానేకాదు. ఓపెనర్లు వేసిన పునాదిని బలపరుస్తూ.. మిడిలార్డర్‌కు సహకరించేలా వన్‌డౌన్ బ్యాటర్ వారధిని నిర్మించాల్సి ఉంటుంది. పరిస్థితిని బట్టి ఒక్కోసారి పవర్‌ప్లేలోనే రావాల్సి ఉంటుంది. మరికొన్నిసార్లు బాధ్యతాయుతంగా ఆడుతూ ఇన్నింగ్స్ నిర్మించాల్సి ఉంటుంది. మిగతా వారితో పోలిస్తే వన్‌డౌన్‌లో ఆడే ఆటగాడికి ఫిక్స్‌డ్ పొజిషన్ ఉండటం అత్యంత ముఖ్యం. అందుకు తగ్గట్టుగా అతడు నైపుణ్యాలు కనబరచగలడు. కానీ టీమిండియా నాయకత్వ బృందం దీనిని ఒక ట్రయల్ రూమ్‌గా మార్చేసి ఇష్టారీతిన ప్రయోగాలు చేస్తోంది.

**సమస్యను ఫిక్స్ చేసుకోవాలి**

అయితే, ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. మన జట్టులో ప్రతిభకు కొదవలేదు. కానీ దానిని ఉపయోగించుకునే విధానంలో ?స్పష్టత లోపించింది. ఏదేమైనా వరల్డ్‌కప్ నాటికి టీమిండియా నంబర్ 3 సమస్యను ఫిక్స్ చేసుకోవాలి. అనుభవజ్ఞుడైన సూర్యను లేదంటే.. మూడో స్థానంలో ఇప్పటికే నిరూపించుకున్న తిలక్ వర్మను పంపాలి. ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీలు గెలవాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదు. అందుకు తగ్గ ప్రణాళికలు, జట్టు కూర్పులో స్పష్టత అవసరం.

## రూ.10 వేలు దాటితే కట్టాల్సిందే




వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లించే వారికి అలర్ట్. మీరు చెల్లించాల్సిన మూడో విడత అడ్వాన్స్ ట్యాక్స్ గడువు డిసెంబర్ 15, 2025తో ముగుస్తోంది. మీరు ఇంకా చెల్లించనట్లయితే వెంటనే ఈ పని పూర్తి చేయండి.ట్యాక్స్ పేయర్లు తమ ట్యాక్స్ లయబిలిటీని ఓసారి పునఃసమీక్షించుకుని తాము చెల్లించే పన్ను రూ.10 వేలు దాటుతుంది అనుకుంటే కచ్చితంగా అడ్వాన్స్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. మూడో విడతలో 75 శాతం ట్యాక్స్ పూర్తి చేయాల్సి ఉంటుంది. లేదంటే పన్ను బకాయిలపై భారీగా పెనాల్టీలు, వడ్డీలు కట్టాల్సి వస్తుంది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. టీడీఎస్, టీసీఎస్ వంటి మినహాయింపులు తీసి వేసిన తర్వాత ఒక ఏడాదిలో చెల్లించాల్సిన పన్ను రూ.10,000 దాటిన వారందరూ తమ ట్యాక్స్ అడ్వాన్స్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం ఒకేసారి కాకుండా నాలుగు విడతల్లో చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. డిసెంబర్ 15వ తేదీ నాటికి 75 శాతం పన్ను కట్టి ఉండాలి. లేదంటే పెనాల్టీలు పడతాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 234సీ ప్రకారం పన్ను బకాయిలపై వడ్డీ నిర్ణయిస్తారు. ఇచ్చిన గడువులోపు కట్టని వారికి అడ్వాన్స్ ట్యాక్స్ బకాయిలపై నెలకు 1 శాతం వడ్డీ పడుతుంది. ఇది మూడు నెలలకు చెల్లించాల్సి వస్తుంది. గత మూడు విడతలతో పాటు వచ్చే మార్చి విడతకు సైతం 1 శాతం వడ్డీ అదనంగా చెల్లించాల్సి వస్తుంది. అంటే ఇక్కడ డబుల్ పెనాల్టీ కట్టాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.క్యాపిటల్ గెయిన్స్, లాటరీ, డివిడెండ్ ఇన్‌కమ్ అనేది ముందస్తుగా లెక్కించేందుకు కుదరదు కాబట్టి వాటిని అడ్వాన్స్ ట్యాక్స్ నుంచి మినహాయిస్తారు. అయితే, మార్చి 31 నాటికి మొత్తం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, సెక్షన్ 234సీ ప్రకారం అంచనా వేయలేని ఆదాయాలపై ఎలాంటి వడ్డీ ఉండదు. అలాంటి ఆదాయం వచ్చినప్పుడు తదుపరి విడతలో మొత్తం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అడ్వాన్స్ ట్యాక్స్ కేటగిరీలోని చలాన xచీూ 280 ద్వారా ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు.. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ట్యాక్స్ పేయర్లు 90 శాతం పన్ను చెల్లించి ఉండకపోతే సెక్షన్ 234బీ అనేది అప్లై అవుతుంది. దీంతో ఏప్రిల్ 1 నుంచి అసెస్మెంట్ ఇయర్ మొత్తం నెలకు 1 శాతం చొప్పున వడ్డీ కట్టాల్సి వస్తుంది. ఉదాహరణకు ఆర్థిక సంవత్సరం 2025-26లో సెక్షన్ 234బీ కింద చెల్లించాల్సిన వడ్డీ అనేది ఏప్రిల్ 1, 2026 నుంచి అమలులోకి వస్తుంది. అలాగే బిజినెస్, వృత్తిపరమైన ఆదాయం లేని సీనియర్ సిటిజన్లకు అడ్వాన్స్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంటుంది. తమ ఆదాయంపై టీడీఎస్ సరిగ్గా మినహాయించారని ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

## భారీ నష్టాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు



ఈరోజు ఉదయం భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి, దీనితో మదుపరులలో కొంత ఆందోళన నెలకొంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతా లు రావడంతో ప్రధాన సూచీలు అయిన నిఫ్టీ మరియు సెన్సెక్స్ రెండూ కూడా ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిఫ్టీ సుమారు 131 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసి 25,915 కీలక మార్కు వద్ద ట్రేడ్ అవుతుండగా, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 398 పాయింట్లు కోల్పోయింది. ప్రస్తుతం సెన్సెక్స్ 84,869 పాయింట్ల వద్ద కొనసాగుతూ, మార్కెట్ సెంటిమెంట్ ప్రస్తుతానికి బలహీనంగా ఉందని స్పష్టం చేస్తోంది. మార్కెట్ పతనానికి ప్రధాన కారణం మార్కెట్ హెవీ వెయిట్స్ అని పిలవబడే దిగ్గజ కంపెనీల షేర్లలో వచ్చిన అమ్మకాల ఒత్తిడి అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇండెక్స్ మీద ఎక్కువ ప్రభావం చూపే టాటా స్టీల్, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ మరియు టైటాన్ వంటి బ్లూచిప్ షేర్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ రంగానికి చెందిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్‌బిఐ మరియు యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో చలిస్తున్నాయి. అలాగే ఐటీ దిగ్గజాలైన టిసిఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మరియు ఆటో రంగ షేర్ మారుతి కూడా డీలా పడటంతో మార్కెట్ మరింత దిగజారింది. స్టాక్ మార్కెట్ మొత్తం నష్టాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ఎంపిక చేసిన షేర్లు మాత్రం లాభాల బాట పట్టి ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చాయి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఏషియన్ పెయింట్స్ షేర్లు సానుకూల ధోరణిలో కదులుతూ లాభాలను నమోదు చేస్తున్నాయి. అలాగే డిఫెన్స్ మరియు మౌలిక వసతుల రంగానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మరియు ఎల్ అండ్ టి షేర్లు కూడా కొనుగోలు మద్దతును పొందుతున్నాయి. మార్కెట్ అమ్మకాల ఒత్తిడిలో ఉన్నప్పటికీ, ఈ కంపెనీల షేర్లు గ్రీన్ జోన్‌లో ట్రేడ్ అవుతుండటం గమనార్హం. మొత్తంగా చూస్తే, మార్కెట్ ఆరంభంలోనే బేర్స్ పట్టు బిగించడంతో బుల్స్ వెనకడుగు వేయాల్సి వచ్చింది. ట్రేడింగ్ సెషన్ ముగిసే సమయానికి సూచీలు కోలుకుంటాయా లేదా నష్టాలు మరింత పెరుగుతాయా అనేది వేచి చూడాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాబట్టి ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని, మార్కెట్ కదలికలను గమనిస్తూ జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143